## నైనీ గనుల్లో బొగ్గు తవ్వకాలు షురూ



వర్చువల్‌గా గనిని ప్రారంభిస్తున్న భట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : 136 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి మరో మైలురాయిని అధిగమించింది. రాష్ట్రం బయట తొలిసారిగా ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు తవ్వకాలను ప్రారంభించింది. రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి వర్చువల్‌గా ఈ గనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒడిశాలో బొగ్గుగనిని ప్రారంభించుకోవడం సువర్ణాధ్యాయమని, దీని ద్వారా అంతర్జాతీయ విస్తరణకు సింగరేణి శ్రీకారం చుట్టిందన్నారు. ఇక నుంచి ఇతర దేశాలకు సైతం సింగరేణి విస్తరిస్తుందని, తద్వారా గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందన్నారు. నైనీ సమీపంలో 160 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మరో వైపు, సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారిగా రాష్ట్రం బయట బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుకుని సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్‌లో తవ్వకాలతో బంగారు బాటలేసిందన్నారు.

## గ్రీన్ ఎనర్జీలోకి భారీగా పెట్టుబడులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు రెండు సంస్థలు ముందుకొచ్చాయి. రూ. 27 వేల కోట్లతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేందుకు ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో రూ.2 వేల కోట్లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్ట్‌లను నెలకొల్పడానికి జీపీఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్‌లోని టీజీ ఐఆర్‌డీలో టీజీ రెడ్కోతో ఈ రెండు సంస్థలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వరిగడ్డితో కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయడానికి జీపీఆర్ఎస్ ఆర్య సంస్థ ముందుకు రావడం పట్ల భట్టి విక్రమార్క అభినందించారు. దావోస్ పర్యటనలో తమ ప్రభుత్వం సన్‌పెట్రో కంపెనీ రూ.20 వేల కోట్లతో 3,400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నదన్నారు.

## సురానా గ్రూప్‌పై ఈడీ దాడులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న సురానా గ్రూపుపై ఈడీ దాడులు చేసింది. ఈ గ్రూపునకు అనుబంధంగా ఉన్న సాయిసూర్య డెవలపర్స్ కూడా సోదాలు నిర్వహించారు. బుధవారం వేకువ జామున ప్రారంభమైన ఈ దాడులు గ్రూపు చైర్మన్, డైరెక్టర్ ఇండ్లలో ఏకకాలంలో చెన్నైకు చెందిన ఈడీ బృందాలు ఈ సోదాలు నిర్వహించారు. సురానా గ్రూపు..చెన్నై ఎస్బీఐ బ్యాంక్ నుంచి వేల కోట్ల రూపాయలు రుణాన్ని తీసుకొని ఎగ్గొట్టినట్టు, దీంతో గ్రూపుపై 2012లోనే సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ సమయంలో 400 కిలోల బంగారాన్ని సీబీఐ స్వాధీనం చేసుకున్నది. కాగా, దీంట్లో 103 కిలోల బంగారం మాయం కావడం సంచలనంగా మారింది. ఈ మాయమైన బంగారంపై నిగ్గు తేల్చడానికి రంగంలోకి దిగిన ఈడీ..ఒకేసారి పదిచోట్ల తనిఖీలు నిర్వహించింది.

## విప్రో ఆశాజనకం




న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ విప్రో ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,569.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,834.6 కోట్ల లాభంతో పోలిస్తే 26 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.22,208.3 కోట్ల నుంచి రూ.22,504.2 కోట్లకు ఎగబాకినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.89,088.4 కోట్ల ఆదాయంపై రూ.13,135.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఐటీ ఆదాయం 2,505-2,557 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనావేస్తున్నది.

# పుత్తడి @ రూ.98,100



**వెండికీ డిమాండ్.. కిలో రూ.1,900 జంప్**

ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు

- అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం
- ఆర్థిక మాంద్యం భయాలు
- స్టాక్, బాండ్ మార్కెట్లలో ఒడిదుడుకులు
- బంగారంపై పెరుగుతున్న పెట్టుబడులు
- జ్యుయెల్లర్స్, రిటైలర్స్ నుంచి భారీ డిమాండ్

### ఒక్కరోజే రూ.1,650 ఎగబాకిన రేటు
### దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైకి ధరలు
### అంతర్జాతీయంగా ఔన్స్ గోల్డ్ 3,318 డాలర్లకు

**పసిడి ధరల పరుగులకు పట్టపగ్గాల్లేకుండాపోతున్నాయి.**

**దేశ, విదేశీ మార్కెట్లలో ఆకాశమే హద్దుగా గోల్డ్ రేట్లు దూసుకుపోతున్నాయి మరి.**

**ట్రంప్ టారిఫ్ వార్‌తో ఏర్పడ్డ అనిశ్చిత పరిస్థితులు.. భారతీయ విపణిలో తులం పుత్తడి విలువను లక్ష రూపాయలకు చేరువ చేస్తున్నది.**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: బంగారం ధరలు కొత్త శిఖరాన్ని అధిరోహించాయి. తొలిసారి దేశీయ మార్కెట్‌లో తులం రేటు రూ.98,000 మార్కును అధిగమించింది. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.98,100గా నమోదైంది. ఈ ఒక్కరోజే రూ.1,650 పుంజుకోవడం గమనార్హం. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరతీసిన ప్రతీకార సుంకాలు.. ప్రపంచవ్యాప్తంగా స్టాక్, బాండ్ మార్కెట్లలో తీవ్ర అలజడులను సృష్టిస్తున్నాయి. ఈ ఒడిదుడుకుల నుంచి తప్పించుకొనేందుకు మదుపరులు తమ పెట్టుబడులను పుత్తడి వైపునకు మళ్లిస్తున్నారని, ఇటీవలికాలంలో ధరలు ఇలా ఉరకలు వేయడానికి ప్రధాన కారణం అదేనని మార్కెట్ నిపుణులు ప్రస్తుత ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఈ నెల 11న తులం ధర ఏకంగా రూ.6,250 ఎగిసిన విషయం తెలిసిందే. ఇప్పటిదాకా భారతీయ మార్కెట్లలో ఒక్కరోజే ఈ స్థాయిలో పెరగడం అదే మొదటిసారి. మరోవైపు ఈ ఏడాది మొదలు పసిడి ధర దేశీయంగా 10 గ్రాములు రూ.19,150 లేదా 24 శాతం ఎగిసింది. గత ఏడాది డిసెంబర్ 31న తులం రేటు రూ.78,950 వద్ద ముగిసింది.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లోనూ పుత్తడి ధరలు దౌడుతీస్తున్నాయి. 24 క్యారెట్ 10 గ్రాముల విలువ రూ.990 పెరిగి రూ.96,170కి చేరింది. అలాగే 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత లేదా నగల బంగారం) రేటు రూ.950 అందుకుని రూ.88,150 వద్ద నిలిచింది. ధరలు క్రమేణా పెరుగుతూపోతున్న నేపథ్యంలో అమ్మకాలతో సంబంధం లేకుండా జ్యుయెల్లర్స్, రిటైలర్ల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వస్తున్నదని బులియన్ ట్రేడర్లు చెప్తున్నారు. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1,900 పెరిగి రూ.99,400ను తాకింది. సాధారణ కొనుగోలుదారులతోపాటు ఇండస్ట్రీ వర్గాల నుంచి ఆదరణ వస్తుండటం కలిసొస్తున్నదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు దూసుకుపోతున్నాయి. ఔన్స్ గోల్డ్ రేటు గరిష్ఠంగా 3,318 డాలర్లు పలికింది. ఔన్స్ వెండి 32.86 డాలర్లుగా నమోదైంది. కాగా, అమెరికా-చైనా మధ్య పరస్పర సుంకాలు పెరిగినకొద్దీ గోల్డ్ రేట్లు పరుగులు పెడుతూనే ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే భారతీయ మార్కెట్‌లో తులం లక్ష రూపాయల మార్కును చేరే సమయం ఎంతో దూరంలో లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

# చైనాపై 245% టారిఫ్





### మరో 100 శాతం సుంకాలు విధించిన అమెరికా
### ఇరు దేశాల మధ్య తీవ్రరూపం దాల్చిన వాణిజ్య యుద్ధం
### బెదిరింపులకు భయపడేది లేదంటున్న డ్రాగన్
### చర్చలకు ట్రంప్ ఆఫర్.. చైనాకు నూతన వాణిజ్య దూత

వాషింగ్టన్/బీజింగ్, ఏప్రిల్ 16: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. పరస్పరం ప్రతీకార సుంకాలతో ఇరు దేశాలు తగ్గేదేలే అంటున్నాయి. తాజాగా చైనా నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై మరో 100 శాతం అదనపు సుంకాలు వచ్చిపడ్డాయి. ఈ మేరకు అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారిక ఆదేశాలు జారీ చేసినట్టు వైట్‌హౌజ్ వర్గాలు బుధవారం ప్రకటించాయి. దీంతో చైనాపై సుంకాల భారం 245 శాతానికి చేరినట్లైంది. మంగళవారం రాత్రే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోగా.. అమెరికాకు చెందిన బోయింగ్ విమానాలను చైనాకు చెందిన ఏ విమానయాన సంస్థ తీసుకోవద్దని జిన్‌పిన్ సర్కారు హుకుం జారీ చేసిన నేపథ్యంలోనే ఈ సుంకాల పెంపు చోటుచేసుకున్నది. ఆయా దేశాల సుంకాలతో దిగాలుపడిన అమెరికా ఆర్థిక వ్యవస్థకు పూర్వ వైభవం తేవడమే లక్ష్యంగా.. ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఈ ప్రతీకార సుంకాలకు రెండు వారాల క్రితం తెరతీసిన విషయం తెలిసిందే. అయితే ఇంటా-బయట ఆందోళనలు చెలరేగడం, మదుపరుల భయాలతో స్టాక్-బాండ్ మార్కెట్లు భీకర నష్టాల్లోకి జారుకోవడంతో వెనక్కితగ్గిన ట్రంప్ సర్కారు.. 90 రోజులపాటు సుంకాల అమలును వాయిదా వేసింది. కానీ చైనాకు మాత్రం ఈ ఊరట దక్కలేదు. అమెరికా సుంకాలకు దీటుగా స్పందించడమే కారణం. ఇక భారత్‌సహా అనేక దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు ప్రయత్నిస్తుండగా, బంతి చైనా కోర్టులోనే ఉందని, ట్రేడ్ వార్‌కు ముగింపు పలకాలో.. వద్దో ఆ దేశమే తేల్చుకోవాలని ట్రంప్ వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని చైనా తెగేసి చెప్తున్నది. ఇప్పటికే చైనాలోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపై 125 శాతం సుంకాలను అమల్లోకి తెచ్చిన జిన్‌పిన్ సర్కారు.. ఎలక్ట్రానిక్, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ప్రధాన ఖనిజాల ఎగుమతులకు బ్రేక్ వేసిన సంగతి విదితమే.

**చర్చల కోసం లీ..**

అమెరికాతో ట్రేడ్ వార్ తారస్థాయికి చేరిన నేపథ్యంలో ప్రపంచ దేశాల మద్దతు కోసం చైనా గట్టిగానే ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే కొత్త అంతర్జాతీయ వాణిజ్య దూతను జిన్‌పిన్ సర్కారు నియమించింది. లీ చెంగాంగ్‌ను తమ నూతన ఇంటర్నేషనల్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌గా బుధవారం చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే సుంకాల ప్రతిష్ఠంభనకు తెర దించేందుకు ట్రంప్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఇది మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. పైగా 2020లో అప్పటి ట్రంప్ సర్కారుతో ఏర్పడ్డ ప్రతీకార సుంకాల పోరుకు స్వస్తి చెప్పేందుకు చైనా జరిపిన చర్చల్లో లీ పాల్గొనడం గమనార్హం. గతంలో ఈయన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చైనాకు అధికార ప్రతినిధిగా కూడా ఉన్నారు. ఇక ఇప్పటికే అమెరికా సుంకాలపై చైనా డబ్ల్యూటీవోలోనూ పోరాడుతున్నది తెలిసిందే. అలాగే అధిక సుంకాలను ఎదుర్కొంటున్న యూరోపియన్ యూనియన్ (ఈయూ) తదితర దేశాల మద్దతు కోసమూ తీవ్రంగానే ప్రయత్నిస్తున్నది. ఇదిలావుంటే ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో చైనా జీడీపీ అంచనాలను మించి 5.4 శాతంగా నమోదైంది. టారిఫ్ వార్ నడుమ గ్లోబల్ మార్కెట్‌లో ఆ దేశ ఎకానమీపై ఏర్పడ్డ భయాలను ఈ గణాంకాలు తొలగించేస్తుండటం విశేషం.

## ఐసీఐసీఐ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ కోత

ముంబై, ఏప్రిల్ 16: ఐసీఐసీఐ బ్యాంక్ కూడా డిపాజిట్లపై వడ్డీరేటును పావు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రూ.50 లక్షల లోపు డిపాజిట్లపై 2.75 శాతం వడ్డీ లభించనున్నది. అంతకుముందు ఇది 3 శాతంగా ఉండేది. అలాగే రూ.50 లక్షలకు పైగా డిపాజిట్లపై వడ్డీరేటును పావు శాతం కోత పెట్టడంతో వడ్డీరేటు 3.25 శాతానికి దిగొచ్చింది. తగ్గించిన రేట్లు ఇప్పటికే అమలులోకి వచ్చాయి.

## కేఫిన్‌టెక్ చేతికి సింగపూర్ సంస్థ

హైదరాబాద్, ఏప్రిల్ 16: హైదరాబాద్ కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న కేఫిన్‌టెక్..సింగపూర్‌కు చెందిన యాక్సెంట్ ఫండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయబోతున్నది. ప్రస్తుతం 34.7 మిలియన్ డాలర్ల(రూ.300 కోట్లు)తో 51 శాతం వాటాను కొనుగోలు చేసిన సంస్థ.. వచ్చే ఐదేండ్లలో 100 శాతం వాటాను హస్తగతం చేసుకోనున్నది.

## మనుమండ్లకు కాదు.. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వండి

- గ్రూప్-1 అవకతవకలపై విచారణ జరిపించండి
- గాలి వినోద్‌కుమార్ డిమాండ్



ఖైరతాబాద్, ఏప్రిల్ 16 : మంత్రులు.. తమ మనుమండ్లు, బంధువులకు ఉద్యోగాలు ఇచ్చుకుంటూ నిరుద్యోగులను విస్మరిస్తున్నారని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మంత్రి కొండా సురేఖ తన మనుమడు ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేశాడని, ఉద్యోగంలో పెట్టించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరడం కాదని, రాష్ట్రంలో నిరుద్యోగులు ఎందరో ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెబుతున్న ప్రభుత్వం.. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు భర్తీ చేసిందని పేర్కొన్నారు. కొత్తగా ఉద్యోగాలిస్తే బడుగు, బలహీనవర్గాలకు చెందిన నిరుద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఇండస్ట్రీ పాలసీలో ఎంతమంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కోదండరాం విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన నిలబడాలని కోరారు. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై జ్యుడీషియల్ కమిటీ వేయాలని, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కంచర్ల బద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## జీపీవోల నియామకంపై హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రామ పాలనాధికారుల (జీపీవోల) నియామకానికి ఈ నెల 1న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ తెలంగాణ వీఆర్వో అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారం విచారణ చేపట్టారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని హైకోర్టులో సవాలు చేశామని, ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే జీపీవోల నియామకాలు చేపట్టడం సరికాదని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. నిబంధనలు రూపొందించకుండా జీపీవోల నియామకాలు చేపట్టడం చెల్లదని చెప్పారు. అనంతరం ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జీపీవోల నియామకం ప్రభుత్వ విధాన నిర్ణయమని స్పష్టం చేశారు. ఈ వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు నిమిత్తం సీఎస్‌తోపాటు సీసీఎల్ఏ, రెవెన్యూ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీచేశారు. తదుపరి విచారణను జూన్ 18కి వాయిదా వేశారు.

## ఎస్‌ఎల్‌బీసీ రెస్క్యూకు సాంకేతిక కమిటీ

**12 మందితో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో ఇప్పటికీ ఆచూకీ దొరకకుండా పోయిన ఆరుగురు కార్మికుల జాడ కనుగొనేందుకు చేపట్టిన రెస్క్యూలో అనుసరించాల్సిన వ్యూహాలపై రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కమిటీని నియమించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గల్లంతు కాగా, ఇద్దరి మృతదేహాలు లభించాయి. మరో ఆరుగురి జాడ తెలియలేదు. ఈ నేపథ్యంలో 12 మందితో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో సభ్యులుగా ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్, ఏఎస్ఐఆర్ డైరెక్టర్, నేషనల్ మిషన్ హెడ్-వీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ డైరెక్టర్, టన్నెల్ నిపుణుడు పరిక్షిత్ మెహ్రా, రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, ఎస్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్, ఎస్డీఆర్ఎఫ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్, ఇరిగేషన్ శాఖ సీడీవో చీఫ్ ఇంజినీర్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎస్ఎల్‌బీసీ చీఫ్ ఇంజినీర్‌ను నియమించింది. మరో సభ్యుడిగా ఎవరైనా ఒక టన్నెల్ నిపుణుడిని నియమించుకునే అధికారాన్ని కమిటీకి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## టీఏసీలో మరోసారి 'సీతారామ'

- 24న కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో సమావేశం
- ప్రాజెక్టు అనుమతులు లాంఛనమే!



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): కేంద్ర జల్‌శక్తి శాఖ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి టెక్నికల్ అప్రైజల్ కమిటీ (టీఏసీ)లో మరోసారి సమీకృత సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు అనుమతులపై చర్చించనున్నారు. 24న ఢిల్లీలో ఈ సమావేశం జరగనున్నది. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోని హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర నదీ జల విభాగం, సెంట్రల్ వాటర్ కమిషన్, ఇరిగేషన్ ప్లానింగ్, కాస్ట్ అండ్ ఎస్టిమేషన్, భూగర్భ జల, పర్యావరణ, కాలుష్య నియంత్రణ, అటవీ శాఖలు కలిపి మొత్తంగా 18 డైరెక్టరీల నుంచి ఆమోదం పొందాల్సి ఉంది. అనంతరం కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే టెక్నికల్ అప్రైజల్ కమిటీ తుది అనుమతులను మంజూరు చేస్తుంది. టీఏసీ అనేది కేవలం లాంఛనమే. ఇదిలావుంటే సమీకృత సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌ను 2022లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి సమర్పించింది. అన్ని డైరెక్టరీల నుంచి అనుమతులను సాధించింది. కేంద్ర జల్‌శక్తి శాఖ రివర్ బోర్డుల గెజిట్‌లోని ఫ్లో చార్ట్‌ను అనుసరించి ప్రాజెక్టు డీపీఆర్‌ను జీఆర్ఎంబీకి నిరుడు ఏప్రిల్‌లో పంపించింది. బోర్డు సైతం అదే ఏడాది మే నెలలో సమావేశం నిర్వహించింది. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలతో తిరిగి కేంద్రానికి నివేదించింది. అయితే నాటి నుంచి టీఏసీ సమావేశాన్ని నిర్వహించకపోవడంతో తుది అనుమతుల మంజూరు పెండింగ్‌లో ఉంది. ఎట్టకేలకు సుదీర్ఘ విరామం తర్వాత కేంద్ర జల్‌శక్తి శాఖ సెక్రటరీ దేబశ్రీ ముఖర్జీ ఆధ్వర్యంలో అప్రైజల్ కమిటీ 157వ సమావేశాన్ని ఢిల్లీలో గత ఫిబ్రవరిలో నిర్వహించారు. సీతారామ ప్రాజెక్టు అనుమతులపై కమిటీ మెంబర్లు, అన్నివిభాగాల డైరెక్టర్లు చర్చించారు. అయితే మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు ఘటనను సాకుగా చూపి ప్రాజెక్టు అనుమతులను టీఏసీ తిరస్కరించింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా బరాజ్ డిజైన్లను పరిశీలించాలని సీడబ్ల్యూసీ సూచించింది. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ సీడీవో (సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్స్) రూపొందించి, సమర్పించిన డిజైన్లను పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించింది. భూకంపన పరీక్షలతోపాటు, పలు సాంకేతిక పరీక్షలను నిర్వహించి ఆ నివేదికలను సమర్పించాలని షరతులు విధించింది. అయితే ఇటీవల టీఏసీ సూచనల మేరకు అందుకు సంబంధించిన నివేదికలను సీడబ్ల్యూసీకి తెలంగాణ సమర్పించింది. డిజైన్లను సైతం సీడబ్ల్యూసీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో సీతారామ ప్రాజెక్టు అనుమతుల మంజూరు అంశాన్ని మరోసారి టీఏసీకి ప్రతిపాదించారు. 24వ తేదీన ఢిల్లీలో మధ్యాహ్నం 3 గంటలకు టీఏసీ 158వ సమావేశం కొనసాగనున్నది. ఈ నేపథ్యంలో ఈసారి ప్రాజెక్టుకు తుది అనుమతులు రావడం లాంఛనమేనని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ప్రాజెక్టుల అప్పగింతకు చర్యలు తీసుకోండి

### అప్పుడే సజావుగా నీటి వాటాల వినియోగం
### తెలంగాణకు కేఆర్ఎంబీ తాజా లేఖ

హైదరాబాద్, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్లు అయిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు సంబంధించిన మొత్తంగా 15 ఔట్‌లెట్లను బోర్డుకు అప్పగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అప్పుడే రాష్ట్రాల నీటి వాటాలను సజావుగా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పేర్కొన్నది. ఈ మేరకు తెలంగాణ సర్కారుకు బోర్డు తాజాగా లేఖ రాసింది. ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి ఏపీ ఇష్టారాజ్యంగా జలాలను తరలించుకుపోతున్నదని, ఫలితంగా తెలంగాణ ఆయకట్టుకు, హైదరాబాద్ తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలంగాణ సర్కారు ఇప్పటికే బోర్డుకు పలుసార్లు ఫిర్యాదు చేసింది. జలాల వినియోగాన్ని బోర్డు నియంత్రించాలని, పర్యవేక్షించాలని, ఏపీని నిలువరించాలని కోరింది. ఈ నేపథ్యంలో కేఆర్ఎంబీ తాజాగా స్పందించింది. రివర్ బోర్డు గెజిట్‌ను అనుసరించి ఉమ్మడి ప్రాజెక్టుల ఔట్‌లెట్లను బోర్డుకు స్వాధీనం చేయాలని, తద్వారా జలాల వినియోగాన్ని నియంత్రించే అవకాశం ఉంటుందని స్పష్టంచేసింది. ప్రాజెక్టుల స్వాధీనానికి ఏపీ సుముఖంగా ఉన్నదని, తెలంగాణ రాష్ట్రమే అంగీకరించడం లేదని పేర్కొన్నది. ఇప్పటికైనా ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణకు సూచించింది. నీటి వినియోగానికి సంబంధించి తెలంగాణతో సమావేశమై చర్చించుకుంటామని ఏపీ వెల్లడించిందని తెలిపింది.

## శ్రీశైలం డ్యామ్ పరిశీలనకు ఎన్‌డీఎస్‌ఏ

- 28న చైర్మన్‌తోపాటు నిపుణుల బృందం రాక
- 3 రోజులపాటు పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం డ్యామ్ భద్రతను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించడంతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో చర్చించేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సిద్ధమైంది. అందులో భాగంగా ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తోపాటు పలువురు నిపుణులు 28, 29, 30వ తేదీల్లో ఇరు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. రెండు రాష్ట్రాల సాగునీటి పారుదల శాఖ అధికారులతో వేర్వేరుగా భేటీ కానున్నారు. ఈ నెల 28న ఎన్‌డీఎస్ఏ చైర్మన్, నిపుణులు నేరుగా ఢిల్లీ నుంచి విజయవాడకు చేరుకోనున్నారు. అదే రోజు ఏపీ జలవనరుల శాఖ అధికారులు, సెక్రటరీతో సమావేశమవుతారు. 29న శ్రీశైలం డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. 30న హైదరాబాద్‌కు చేరుకుని తెలంగాణ ఇంజినీర్లతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

## గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావును ప్రశ్నించారు. ప్రభుత్వ నిధుల చెల్లింపునకు సంబంధించిన వివరాలతోపాటు ఈ కుంభకోణంలో దళారులు మొయినుద్దీన్, క్రముద్దీన్ పాత్రపై వారు ఆరా తీసినట్టు తెలిసింది. గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందంటూ గతంలో ఏసీబీ కేసు నమోదుచేసి, పలువురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేసిన ఈడీ అధికారులు.. తాజాగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను విచారించారు.

## రెరా చైర్మన్‌కు ఘనంగా వీడ్కోలు



జస్టిస్ రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): లోకాయుక్తగా నియమితులైన రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డికి ట్రిబ్యునల్ సభ్యులు బుధవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రిబ్యునల్‌లో తగిన వసతుల కల్పనకు, కేసుల పరిష్కారానికి సహకరించిన సభ్యులు, న్యాయవాదులు, కక్షిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రిబ్యునల్ సభ్యులు పీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, చిత్రారామచంద్రన్, రిజిస్ట్రార్ వై గోవిందరెడ్డి పాల్గొన్నారు. రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ తొలి చైర్మన్‌గా నియమితులైన జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి కేవలం 6 నెలల్లోనే 20 కేసులు పరిష్కరించారు.

## పట్టిసీమ ద్వారా గోదావరి జలాల మళ్లింపు

- ఆ మేరకు కృష్ణా జలాలను తెలంగాణకు కేటాయించవచ్చు
- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను మళ్లిస్తున్నదని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ మరోసారి వాదించింది. ఆ మేరకు కృష్ణా జలాల వినియోగం తగ్గుతుందని, ఆ నీటిని తెలంగాణకు కేటాయించవచ్చని నివేదించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్-3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునః పంపిణీకి సంబంధించి జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ ఢిల్లీలో బుధవారం సైతం కొనసాగింది. ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర ఎదుట తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలను కొనసాగించారు. ఏపీ ప్రభుత్వం ఏయే ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లిస్తున్నదో వివరించారు. పోలవరం పూర్తయ్యే వరకే గోదావరి జలాలను తరలిస్తామని పేర్కొంటూ పట్టిసీమ ప్రాజెక్టును తాత్కాలికంగా చేపట్టినప్పటికీ, దానిని తొలగించే ఉద్దేశం ఏపీకి లేదని, శాశ్వతంగా కొనసాగిస్తుందని తెలిపారు. తద్వారా గోదావరి జలాలను అదనంగా కృష్ణా డెల్టాకు తరలించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. దీంతో ఎగువన కృష్ణా జలాల వినియోగం ఏపీకి తగ్గుతుందని, తద్వారా ఆదా చేసే జలాలను తెలంగాణకు కేటాయించవచ్చని సూచించారు. గురువారం కూడా ట్రిబ్యునల్ విచారణ కొనసాగనున్నది.

## కార్మికులు ఐక్యతను చాటాలి

### సమ్మెలో కార్మిక సంఘాలన్నీ పాల్గొనాలి
### ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ ఉద్యోగులను సమ్మెను నిరోధించేందుకు ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నాయని కార్మిక సంఘాల జేఏసీ ఆరోపించింది. ఈ మేరకు జేఏసీ నాయకులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కుతంత్రాలను తిప్పికొట్టి, కార్మికుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. మే 7న జరిగే సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొనాలని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో-చైర్మన్ కే హన్మంతు ముదిరాజ్, వైస్‌చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బీ యాదగిరి కోరారు. మంగళవారం జేఏసీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించిందని, సమ్మె విజయవంతం కోసం ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అన్ని కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల విస్తృత ప్రయోజనాల కోసం, దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలన్నీ 'ఒకే మాట-ఒకే బాట-అదే సమ్మె బాట' అనే నినాదంతో సమ్మెలో పాలుపంచుకోవాలని జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.